## నీరజ్ చోప్రాకు లెఫ్టినెంట్ కర్నల్ హోదా




ఢిల్లీ: భారత గోల్డెన్ బాయ్ నీరజ్ చోప్రాకు మరో అరుదైన గౌరవం దక్కింది. టోక్యో ఒలింపిక్స్‌లో స్వర్ణం, పారిస్‌లో రజతం సాధించిన నీరజ్‌కు భారత సైన్యం లెఫ్టినెంట్ కర్నల్ హోదా అందించింది. ఈ మేరకు బుధవారం కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించింది. 2016లో నయీబ్ సుబేదార్ హోదాలో ఆర్మీలో చేరిన నీరజ్.. టోక్యోలో పసిడి తర్వాత సుబేదార్ హోదా పొందాడు. 2022లో కేంద్ర ప్రభుత్వం అతడిని పద్మశ్రీతో సత్కరించింది.

## ఆసియా టోర్నీకి పాక్ అనుమానమే!




ఢిల్లీ: దాయాది దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్తతలతో ఆ దేశంతో క్రమంగా సంబంధాలు తెంపుకుంటున్న భారత్.. క్రీడల్లోనూ అదే వైఖరిని కొనసాగిస్తున్నది. ఇప్పటికే ఇరు దేశాల మధ్య క్రికెట్ సంబంధాలు దెబ్బతినగా.. ఈ ఏడాది ఆగస్టు నుంచి బీహార్ (రాజ్‌గిర్) వేదికగా జరగాల్సి ఉన్న ఆసియా కప్ హాకీలో పాక్ పాల్గొనడంపై సందిగ్ధత నెలకొంది. ఆగస్టు 27-సెప్టెంబర్ 07 మధ్య 12వ ఎడిషన్‌గా జరిగే ఈ టోర్నీలో ఆతిథ్య భారత్‌తో పాటు జపాన్, కొరియా, చైనా, మలేషియా, ఒమన్, చైనీస్ తైపీ, పాకిస్థాన్ పాల్గొనాల్సి ఉంది. కానీ ప్రస్తుత పరిస్థితులతో పాక్ ఆసియా కప్ ఆడటం కష్టమేనన్న వాదన వినిపిస్తున్నది. వచ్చే ఏడాది నెదర్లాండ్స్, బెల్జియంలో జరిగే హాకీ ప్రపంచకప్‌నకు ఆసియా కప్ క్వాలిఫయింగ్ టోర్నీ కావడం గమనార్హం. ఈ నేపథ్యంలో పాక్‌ను ఆసియా కప్ ఆడేందుకు అనుమతిస్తారా? లేదా? అన్న దానిపై అనిశ్చితి నెలకొంది. దీనిపై హాకీ ఇండియా సెక్రటరీ జనరల్ భోలానాథ్ సింగ్ మాట్లాడుతూ.. 'ఈ టోర్నీకి ఇంకా మూడు నెలల సమయముంది. ఇప్పుడే దీని గురించి మాట్లాడటం సమంజసం కాదు. కానీ మేం కేంద్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నడుచుకుంటాం' అని చెప్పారు. ఒకవేళ పాక్‌ను ఆడించకుంటే ఆ స్థానంలో మరో దేశాన్ని చేర్చే అవకాశముంది.

## అమ్మాయిలు ముందంజ

**లక్ష్యసేన్, రజావత్ ఔట్**



బ్యాంకాక్: బీడబ్ల్యూఎఫ్ థాయ్‌లాండ్ ఓపెన్ సూపర్ 500 బ్యాడ్మింటన్ టోర్నీలో మహిళల సింగిల్స్ బరిలో ఉన్న షట్లర్లు తొలి రౌండ్ విఘ్నాన్ని విజయవంతంగా దాటారు. మాళవిక బన్సోద్, ఆకర్షి కశ్యప్, ఉన్నతి హుడా.. రెండో రౌండ్‌కు దూసుకెళ్లారు. కానీ పురుషుల సింగిల్స్‌లో స్టార్ షట్లర్లైన లక్ష్యసేన్, ప్రియాన్షు రజావత్ మాత్రం మొదటి రౌండ్‌కే ఇంటిబాట పట్టారు. మహిళల సింగిల్స్‌లో అనుపమ ఉపాధ్యాయ సైతం తొలి రౌండ్‌కే వెనుదిరిగింది. మహిళల డబుల్స్‌లో గాయత్రి గోపీచంద్-త్రిసా జాలీ ద్వయం రెండో రౌండ్‌కు చేరింది.

## సెమీస్‌లో గాఫ్

రోమ్: ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీకి సన్నాహకమైన ఇటాలియన్ ఓపెన్‌లో అమెరికా టెన్నిస్ స్టార్ కొకో గాఫ్ సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్స్‌లో గాఫ్ 6-4, 7-6(5)తో మిర్రా ఆంద్రీవాపై అలవోక విజయం సాధించింది. ఆంద్రీవాపై తన వరుస విజయాల పరంపరను కొనసాగిస్తూ గాఫ్ మూడోసారి సెమీస్‌లోకి ప్రవేశించింది. మరో సెమీస్‌లో జాస్మిన్ పౌలోని, పీటన్ స్టెర్న్స్ తలపడనున్నారు. పురుషుల సింగిల్స్ క్వార్టర్స్‌లో కార్లోస్ అల్కరాజ్ 6-4, 6-4తో జాక్ డ్రేపర్‌పై గెలిచి సెమీస్‌లోకి ప్రవేశించాడు.



## తెలంగాణ పతక ధమాకా

**నిశికకు మూడు పతకాలు, రిశితకు స్వర్ణం సహా రజతం • లక్ష్మి సిరి, హురెన్ అదీబాకు కాంస్య పతకాలు • ఖేలో ఇండియా యూత్ గేమ్స్**




గయా(బీహార్): బీహార్ వేదికగా జరుగుతున్న ప్రతిష్ఠాత్మక ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో తెలంగాణ ప్లేయర్ల పతక హవా దిగ్విజయంగా కొనసాగుతున్నది. బుధవారం వేర్వేరు ఈవెంట్లలో మన రాష్ట్ర ప్లేయర్లు సత్తాచాటారు. మహిళల జిమ్నాస్టిక్స్‌లో నిశిక అగర్వాల్ స్వర్ణం సహా రెండు కాంస్య పతకాలతో అదరగొట్టింది. టెన్నిస్‌లో బసిరెడ్డి రిశితారెడ్డి స్వర్ణం, రజతం ఖాతాలో వేసుకోగా, లక్ష్మి సిరికి కాంస్యం దక్కింది. మహిళల ఫెన్సింగ్‌లో హురెన్ అదీబా కాంస్యం సొంతం చేసుకుంది. జిమ్నాస్టిక్స్ వాల్టింగ్ టేబుల్ ఈవెంట్‌లో నిశిక 12.33పాయింట్లతో పసిడి పతకంతో మెరిసింది. అద్భుతమైన ప్రదర్శన కనబరుస్తూ అగ్రస్థానంలో నిలిచింది. ఇదే విభాగంలో అనౌష్క పాటిల్(12.10), సారా రవూల్(11.70) వరుసగా రజత, కాంస్య పతకాలు దక్కించుకున్నారు. అదే జోరు కొనసాగిస్తూ అన్‌ఈవెన్ బార్స్‌లో నిశిక 9.700 స్కోరుతో కాంస్యం ఖాతాలో వేసుకోగా, బాలెన్సింగ్ బీమ్‌లో మరో కాంస్యం లభించింది. మహిళల సింగిల్స్ ఫైనల్లో రిశితారెడ్డి 6-1, 2-6, 6-3తో ఐశ్వర్య జాదవ్(మహారాష్ట్ర)పై విజయంతో పసిడి దక్కించుకుంది. డబుల్స్ తుది పోరులో రిశిత, లక్ష్మి సిరితో కలిసి రజతం కైవసం చేసుకుంది. ఈ మధ్య నిలకడగా రాణిస్తున్న రిశిత ప్రస్తుతం జూనియర్ ఐటీఎఫ్ విభాగంలో తెలంగాణలో నంబర్‌వన్ ప్లేయర్‌గా కొనసాగుతున్నది. దేశ వ్యాప్త ర్యాంకింగ్స్‌లో ప్రస్తుతం 3వ ర్యాంక్‌లో ఉన్న రిశిత..అంతర్జాతీయంగా 177వ ర్యాంక్‌లో ఉంది.




# మార్పులకు ఓకే

**విదేశీ క్రికెటర్ల రాకపై అనిశ్చితితో నిబంధనల సడలింపు • ప్లేఆఫ్స్‌కు ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా ఆటగాళ్ల దూరం**







ఢిల్లీ: మరో రెండు రోజుల్లో పునఃప్రారంభం కానున్న ఐపీఎల్-18లో పలు జట్లకు విదేశీ ఆటగాళ్ల రాకపై అనిశ్చితి కొనసాగుతున్న వేళ భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఫ్రాంచైజీలకు స్వల్ప ఊరటనిచ్చింది. అందుబాటులో లేని విదేశీ ఆటగాళ్ల స్థానాలను భర్తీ చేసుకోవడానికి గాను టెంపరరీ రిప్లేస్‌మెంట్స్‌కు ఆమోదముద్ర వేసింది. దీని ప్రకారం ఆయా జట్లు ఫారెన్ ప్లేయర్స్ స్థానాన్ని తక్షణమే మరో ప్లేయర్‌తో భర్తీ చేసుకోవచ్చు. దీని ప్రకారమే ఢిల్లీ క్యాపిటల్స్.. ఈ సీజన్‌కు దూరమైన ఆస్ట్రేలియా ఆటగాడు జేక్ ఫ్రేజర్ మెక్‌గర్క్ స్థానంలో బంగ్లాదేశ్ పేసర్ ముస్తాఫిజుర్ రెహ్మాన్‌ను జట్టులోకి తీసుకుంది. అయితే ఈ రిప్లేస్‌మెంట్స్ మాత్రం తాత్కాలికం. వచ్చే ఏడాది జరుగబోయే ఐపీఎల్ మినీ వేలంలో ఈ ఆటగాళ్లను రిటైన్ చేసుకోవడానికి ఆ జట్లకు అవకాశం లేదు. వీళ్లు మినీ వేలంలో పాల్గొనవచ్చునని ఐపీఎల్ సీవోవో హేమంగ్ అమిన్ ఫ్రాంచైజీలకు సూచించాడు.

**వస్తాం కానీ..**

స్వదేశాలకు వెళ్లినవారిలో ఎవరు తిరిగొస్తారు? అన్నదానిపై ఆందోళనపడ్డ ఫ్రాంచైజీలు.. ఆస్ట్రేలియాకు చెందిన పలువురు (స్టార్క్, హాజిల్‌వుడ్) మినహా మిగిలిన దేశాల ఆటగాళ్లంతా తిరిగి రావడానికి సంసిద్ధత వ్యక్తం చేయడంతో ఊపిరి పీల్చుకున్నాయి. బుధవారం పలువురు విదేశీ ఆటగాళ్లు ఫ్రాంచైజీలతో చేరగా శుక్ర, శనివారం నాటికి మిగిలినవారూ ఆయా జట్లతో కలిసే అవకాశముంది. అయితే ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా జట్ల ఆటగాళ్లు మాత్రం లీగ్ దశ ముగియగానే మళ్లీ బ్యాగులు సర్దుకోనున్నారు. వెస్టిండీస్‌తో వన్డే సిరీస్ సందర్భంగా ఇంగ్లండ్ ప్లేయర్లు, ఐసీసీ డబ్ల్యూటీసీ ఫైనల్ కోసం దక్షిణాఫ్రికా ఆటగాళ్లు ప్లేఆఫ్స్‌కు అందుబాటులో ఉండబోమని ఫ్రాంచైజీలకు తేల్చి చెప్పినట్టు సమాచారం. ఆయా దేశాల బోర్డులు సైతం ఈ షరతు మీదే వారిని తిరిగి భారత్‌కు పంపేందుకు అంగీకరించాయి. మే 26న దక్షిణాఫ్రికా ఆటగాళ్లు, మే 27న ఇంగ్లండ్ క్రికెటర్లు మళ్లీ స్వదేశం బాట పట్టనున్నట్టు తెలుస్తున్నది. ఈ ప్రభావం గుజరాత్, బెంగళూరు, ముంబై, ఢిల్లీ జట్లపై అధికంగా పడనుంది.







### ప్రాక్టీస్ మొదలెట్టారు!

తాజా సీజన్ పునరుద్ధరణ ప్రకటన తర్వాత బుధవారం నాటికి పలు జట్లు అందుబాటులో ఉన్న ఆటగాళ్లతో ప్రాక్టీస్ సెషన్స్‌ను తిరిగి ప్రారంభించాయి. గుజరాత్ టైటాన్స్ మంగళవారం నుంచే ప్రాక్టీస్ మొదలుపెట్టగా బుధవారం పంజాబ్, లక్నో, ముంబై ఆటగాళ్లు నెట్స్‌లో చెమటోడ్చారు. చెన్నై ఆటగాళ్లు కూడా చెపాక్‌కు చేరుకుంటున్న విషయాన్ని ఆ జట్టు ఎక్స్ ఖాతాలో వెల్లడించింది. హిట్‌మ్యాన్ రోహిత్ శర్మ సైతం బుధవారం ప్రాక్టీస్ సెషన్స్‌లో పాల్గొన్నాడు.




## గ్రేడ్-ఏ లోనే రోకో

ఢిల్లీ: వారం రోజుల వ్యవధిలో అంతర్జాతీయ టెస్టు క్రికెట్ కెరీర్‌కు వీడ్కోలు పలికిన భారత మాజీ సారథులు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ కాంట్రాక్టులపై బీసీసీఐ స్పందించింది. టీ20లు, టెస్టుల నుంచి తప్పుకున్నా వారిద్దరూ.. బీసీసీఐ గత ఏప్రిల్‌లో ప్రకటించిన మేరకు గ్రేడ్-ఏ లోనే కొనసాగుతారని బోర్డు సెక్రటరీ దేవ్‌జిత్ సైకియా తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. 'రెండు ఫార్మాట్లకూ రిటైర్మెంట్ ప్రకటించినప్పటికీ కోహ్లీ, రోహిత్ గ్రేడ్-ఏ కాంట్రాక్టులు కొనసాగుతాయి. వాళ్లు ఇప్పటికీ భారత క్రికెట్ జట్టులో భాగమే. గ్రేడ్-ఏ సౌకర్యాలన్నీ వారికి అందుతాయి' అని వెల్లడించారు.

## భారత్‌కు ఆ సత్తా ఉంది

**కోహ్లీ, రోహిత్ స్థానాల భర్తీపై అండర్సన్**

లండన్: కోహ్లీ, రోహిత్ రిటైర్ అయినప్పటికీ వారి స్థానాలను భర్తీ చేసే ఆటగాళ్లు భారత జట్టులో పుష్కలంగా ఉన్నారని ఇంగ్లండ్ పేస్ దిగ్గజం జేమ్స్ అండర్సన్ అభిప్రాయపడ్డాడు. అండర్సన్ మాట్లాడుతూ.. 'వాళ్లిద్దరూ గ్రేట్ ప్లేయర్స్. ఈ ద్వయం టెస్టులకు వీడ్కోలు చెప్పినా వారి స్థానాలను భర్తీ చేసే ఆటగాళ్లు ఆ జట్టు సొంతం. మీరు ఐపీఎల్ చూడండి. ప్రత్యర్థులపై ఎదురుదాడికి దిగుతూ దూకుడుకలిగిన కుర్రాళ్లను తీసుకొస్తున్నారు' అని అన్నాడు.




తమిళనాడు ఫిజికల్ ఎడ్యుకేషన్ యూనివర్సిటీ కాలేజీలో బుధవారం జరిగిన కరాటే ఈవెంట్‌లో గిన్నిస్ ప్రపంచ రికార్డు నెలకొల్పిన హైదరాబాద్‌కు చెందిన ఎస్‌పీ రాము.

## ఒకేసారి మూడు నెలల రేషన్ బియ్యం

మొదటిపేజీ తరువాయి...

జరుగుతున్నది. కరోనా సమయంలో తప్ప మునుపెన్నడూ ఇలా ముందస్తుగా పంపిణీ చేయలేదు. పాకిస్థాన్‌తో యుద్ధం సమస్య సమిసిపోయింది, కాల్పుల విరమణ ఒప్పందంతో ప్రస్తుతానికి ప్రశాంత వాతావరణం నెలకొన్నది. అయినప్పటికీ మూడు నెలల బియ్యం ఒకేసారి పంపిణీ చేయాలన్న నిర్ణయంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. యుద్ధం, విపత్కర సమయంలో మాత్రమే ప్రజలకు ఆహార కొరత లేకుండా ఉండేందుకు ముందస్తు పంపిణీ నిర్ణయం తీసుకుంటారు.అయితే రాబోయే వర్షాకాలంలో వరదలతో పాటు ఇతర ప్రతికూల వాతావరణ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకే ఈ చర్యలు తీసుకుంటున్నట్టు కేంద్రం పేర్కొన్నది.

**నిల్వలు ఎత్తండి.. పంపిణీ చేయండి**

ఆగస్టు నెల వరకు లబ్ధిదారులకు మూడు నెలల బియ్యాన్ని తక్షణమే పంపిణీ చేయాలని కేంద్రం ఆదేశించింది. రాష్ట్రాలకు కేటాయించిన బియ్యాన్ని ముందుగా లిఫ్ట్ చేసి ఈ నెలాఖరు వరకు లబ్ధిదారులకు పంపిణీ చేయాలని ఆదేశించింది. ఈ మేరకు ఎఫ్‌సీఐ గోదాముల్లో సరిపడా నిల్వలను అందుబాటులో ఉంచాలని ఆయా రీజియన్ల మేనేజర్లకు సూచించింది. కేంద్రం ఆదేశాలతో ఇప్పటికే పలు రాష్ట్రాలు బియ్యం పంపిణీకి సిద్ధమవుతున్నాయి. తెలంగాణలో మాత్రం జూన్ నెలలో పంపిణీ చేసేందుకు పౌర సరఫరాల శాఖ కసరత్తు చేస్తున్నట్టు తెలిసింది.

## బరాత్ తీయలేదని.. పెండ్లి కూతురు జంప్!

*బడంగ్‌పేట్, మే 14: పెండ్లి ఊరేగింపులో బరాత్ తీయలేదని అలక వహించిన వధువు ఎటో వెళ్లిపోయింది. ఈ ఘటన హైదరాబాద్‌లోని అల్మాస్‌గూడలో బుధవారం జరిగింది. దండుమైలారానికి చెందిన అబ్బాయికి అల్మాస్‌గూడకు చెందిన ఓ అమ్మాయితో వివాహం జరిగింది. విందు ముగిసిన అనంతరం వధూవరులిద్దరూ కారులో దండుమైలారం బయలుదేరారు. వారి వెనకాల బస్సులో బంధువులు అనుసరించారు. కానీ కారు ముందు బ్యాండ్ బాజా మోగకపోవడంతో బరాత్ ఏమైందని వధువు ప్రశ్నించింది. దండు మైలారం చేరుకోవడానికి చాలా రాత్రి అవుతుంది గనుక బరాత్ తీయడం లేదని వరుడు, అతని బంధువులు చెప్పారు. దీంతో అలక వహించిన వధువు కారు బడంగ్‌పేట్ గాంధీనగర్ బస్‌స్టాప్ వద్దకు చేరుకోగానే వరుడిని, అతడి అక్కని గాయపరిచి బయటికి దూకి పారిపోయింది. ఈ హఠాత్పరిణామానికి అందరూ అవాక్కయ్యారు.*

# కొలువుల దందాలో కోటికి స్కెచ్

- సింగరేణిలో ప్రైవేట్ సెక్యూరిటీ ఉద్యోగాల పేరిట దందా
- ఇష్టారాజ్యంగా దళారులు
- ఒక్కొక్కరి వద్ద 3 లక్షలు వసూలు?
- భూనిర్వాసితులనూ వదలని వైనం
- మంత్రులు, ఉన్నతాధికారుల నుంచి పైరవీలు!
- భూపాలపల్లిలో ఎక్కడ చూసినా ఇదే చర్చ




భూపాలపల్లి సింగరేణి సెక్యూరిటీ కార్యాలయం

జయశంకర్ భూపాలపల్లి, మే 14 (నమస్తే తెలంగాణ): సింగరేణి కాలరీస్ కంపెనీలో ప్రైవేట్ సెక్యూరిటీ ఉద్యోగాల దందా బహిరంగంగా కొనసాగుతున్నది. ఉద్యోగానికి రూ.3 లక్షల వరకు దళారులు వసూలు చేస్తున్నారు. ఈ డబ్బులు కాంట్రాక్టర్ నుంచి అధికారుల వరకు తలా ఇంత ముట్టజెప్పాల్సి ఉంటుందని దళారులు బాహాటంగా చెప్తున్నారు. భూపాలపల్లి ఏరియాలో ప్రస్తుతం ఇది హాట్ టాపిక్‌గా మారింది. కొంతకాలంగా ఈ ప్రైవేట్ దోపిడీ జరుగుతున్నా ఈ మధ్య మరీ ఎక్కువైంది. అప్పటికంటే ఇప్పుడు రేటు పెంచేశారు. దళారులే నేరుగా మంత్రులు, సింగరేణి ఉన్నతాధికారుల నుంచి లెటర్ ప్యాడ్లు తీసుకొచ్చి పైరవీలు చేస్తున్నారు. రెండు రోజులుగా ఎక్కడ చూసినా ప్రైవేట్ సెక్యూరిటీ ఉద్యోగాల (ఔట్‌సోర్సింగ్) చర్చే వినిపిస్తున్నది. గతంలో రూ.2 లక్షలు వసూలు చేసేవారు.. ఇప్పుడు రూ.3 లక్షలు ఏమిటని నిరుద్యోగులు దళారులను ప్రశ్నిస్తున్నారు. ఇందులో నుంచి కాంట్రాక్టర్, సింగరేణి అధికారులు, యూనియన్ లీడర్లకు సమర్పించుకోవాల్సి ఉంటుందని దళారులు బహిరంగంగానే చెప్తున్నట్టు నిరుద్యోగులు పేర్కొన్నారు. భూములు కోల్పోయిన నిర్వాసితులకు సింగరేణి ఉపాధి చూపించాల్సి ఉండగా వారి నుంచి కూడా దళారులు ముక్కుపిండి మరీ డబ్బులు వసూలు చేస్తున్నారు.

**47 మందిని నియమించే అవకాశం..**

భూపాలపల్లి ఏరియాలోని కేటీకే-1, 5, 6, 8 ఇంక్లైన్, ఓసీ-2, 3తో పాటు పలు డిపార్ట్‌మెంట్లలో సింగరేణి సంస్థ పర్మనెంట్, ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులను నియమిస్తున్నది. సంస్థకు సంబంధించిన ఆస్తుల పరిరక్షణ కోసం వీరు పనిచేయాలి. ప్రస్తుతం భూపాలపల్లి ఏరియాలో 68 మంది పర్మనెంట్, 116 మంది ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు పనిచేస్తున్నారు. సింగరేణి సంస్థలో భూములు కోల్పోయిన వారికి సెక్యూరిటీ గార్డులుగా ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉండగా అధిక శాతం నాన్ లోకల్ వారితోనే భర్తీ చేస్తూ అక్రమ దందాకు తెరలేపుతున్నారు. ప్రస్తుతం మరో 27మంది ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుల రిక్రూట్‌మెంట్‌కు సంస్థ నోటిఫికేషన్ జారీ చేసింది. 27 మందితోపాటు మరో 20 మందిని అదనంగా తీసుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. దీంతో మళ్లీ పైరవీల పర్వం ప్రారంభమైంది. 27 మందితో పాటు మరో 20 మంది రిలీవర్లు అంటే 47 మంది నుంచి రూ.3 లక్షల చొప్పున సగటున రూ.కోటి వసూలు చేసేందుకు రంగం సిద్ధమైంది. ఇప్పటికే దళారులు నిరుద్యోగుల బయోడేటా, సర్టిఫికెట్లు దగ్గర పెట్టుకుని డీల్ కుదుర్చుకున్నారు. ఇదిలావుండగా ఇప్పటికే సుమారు 30 మంది వద్ద దళారులు డబ్బులు తీసుకుని మెడికల్, వీటీసీ చేయించి నేరుగా డ్యూటీలో చేర్పించేందుకు సిద్ధంచేసి ఉంచారు. ఇప్పుడు మెడికల్, వీటీసీ పూర్తి చేసిన వారిని చేర్పిస్తారా? లేక కొత్త వారిని చేర్పిస్తారా? అనేది తెలియాల్సి ఉన్నది. కొత్తవారిని చేర్పిస్తే ఇప్పటికే మెడికల్, వీటీసీ చేసిన వారు ఆందోళనకు దిగే అవకాశాలున్నాయి.

**దళారులను ఆశ్రయించొద్దు..**

ప్రైవేటు సెక్యూరిటీ గార్డుల ఎంపిక విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకుంటాం. నిబంధనల ప్రకారం ఎంపిక చేస్తాం. ఎవరికీ డబ్బులు ఇవ్వొద్దు. నేను పైరవీలను ఏ మాత్రం లెక్క చేయను. డబ్బులు ఎవరు వసూలు చేస్తున్నారనే విషయమై విచారణ జరిపిస్తా. ఇప్పటికే మెడికల్, వీటీసీ చేసిన వారితో మాకు సంబంధం లేదు. దళారులను నమ్మిమోసపోవద్దు.

**– రాజేశ్వర్‌రెడ్డి, భూపాలపల్లి ఏరియా సింగరేణి జీఎం**



ఘట్‌కేసర్‌లోని గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ సందీప్ కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందిస్తున్న మాజీ మంత్రి మల్లారెడ్డి

## గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ సందీప్ మృతి బాధాకరం

- ఆయన కుటుంబానికి అండగా ఉంటా..
- ఆర్థిక సహాయం అందించిన ఎమ్మెల్యే మల్లారెడ్డి

ఘట్‌కేసర్, మే 14: మావోయిస్టుల మందుపాతర పేలి గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ తిక్క సందీప్ మృతిచెందడం బాధాకరమని మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. ఘట్‌కేసర్‌లో నివాసం ఉంటున్న సందీప్ తల్లి, భార్యను బుధవారం పరామర్శించి ధైర్యం చెప్పారు. వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తన వంతు సహాయంగా రూ. 3 లక్షల నగదు అందజేశారు. దేశం కోసం ప్రాణాలర్పించిన తిక్క సందీప్ కుటుంబానికి ఎల్లవేళలా సహాయ సహకారాలు అందిస్తానని, ఏ ఆపద వచ్చిన ఆదుకుంటానని భరోసా ఇచ్చారు. కుటుంబంలోని ఒక్కరికి ఉద్యోగం వచ్చేలా కృషి చేస్తానని మల్లారెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు బండారి శ్రీనివాస్‌గౌడ్, సహకార సంఘం డైరెక్టర్ ధర్మారెడ్డి, మాజీ ఎంపీటీసీ నర్సింగ్‌రావు, మాజీ కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# చెరువుల క్రమబద్ధీకరణ!

మొదటిపేజీ తరువాయి...

భూములను నేరుగా రెసిడెన్షియల్ జోన్లుగా మార్చడానికి చర్యలు చేపట్టడం వివాదాస్పదమవుతున్నది. చెరువులను పరిరక్షిస్తున్నామని చెప్పుకునే హెచ్‌ఎండీఏనే జలవనరులను జనావాసాలుగా మార్చేస్తున్నది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 84లో నవయుగ లిగాల ఎస్టేట్ కంపెనీకి భూమి ఉన్నది. ఇందులో 5,234 మీటర్ల భూమి నిషేధిత జాబితాలో ఉన్నట్టు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ పేర్కొన్నది. ఇదే సర్వే నంబర్‌లో కొంత భాగం గోపి చెరువు బఫర్ జోన్‌లో ఉన్నదంటూ హెచ్‌ఎండీఏ.. లేక్ ఐడీ 3714 పేరిట ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసింది. ఇప్పటికే సర్వే నంబర్ 84లోని కొంత భూమిని ప్లాట్లు, అపార్టుమెంట్లుగా నవయుగ లిగాల ఎస్టేట్ కంపెనీ విక్రయించింది. 84/పీలో ఉన్న 8.15 ఎకరాల్లో కొంతభాగం చెరువు కింది, మరికొంత భాగం బఫర్‌జోన్‌లో ఉండగా... రెసిడెన్షియల్ జోన్‌లోకి మారుస్తున్నట్టు ప్రకటించింది. దీనికి సంబంధించి ఈ ఏడాది జనవరి 10న 4901/పీఎల్‌జీఐ(1)/2024 పేరిట నోటిఫికేషన్ వెలువడింది. దీనిపై తుది ఉత్తర్వులు జారీ చేసేందుకు ప్రభుత్వానికి హెచ్‌ఎండీఏ నివేదికను కూడా అందజేసింది. రేపోమాపో జీవో జారీ చేసే అవకాశం ఉన్నట్టు సమాచారం. హెచ్‌ఎండీఏ చట్టంలో ఉన్న సెక్షన్-15(3)-2008ను బూచిగా చూపి చెరువులు, బఫర్, ఎఫ్‌టీఎల్ భూములను రెసిడెన్షియల్ ప్రాంతాలుగా మార్చివేస్తున్నారు. ఈ సెక్షన్ ఆధారంగానే ఇప్పటివరకు శేరిలింగంపల్లి సర్వే నంబర్ 84/పీలో ఉన్న ఉన్న భూమిని ఓ నిర్మాణ సంస్థకు చెందినదిగా తెలిపింది.

**ఉన్నదే కొంత భూమి**

ఇప్పటికే గోపీ చెరువు చుట్టూ కాంక్రీట్ జంగిల్‌ను తలపించేలా నిర్మాణాలున్నాయి. బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్ పేరిట కొంచెం భూమిని కూడా విడిచిపెట్టకుండా నిర్మాణ సంస్థ అమ్మకాలు జరుపుతున్నది. ఇప్పుడు బఫర్‌జోన్‌లో నిర్మాణాలు చేపట్టేందుకు ప్రభుత్వమే నిర్మాణ సంస్థలకు సహకరించడం చర్చనీయాంశంగా మారింది. సర్వే నంబర్ 84లో ఇప్పటికే పూర్తి నిర్మాణాలు జరిగిపోగా బఫర్‌జోన్ పరిధిలోని 8.15 ఎకరాల భూమిని రెసిడెన్షియల్ జోన్‌గా మారుస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించడం విడ్డూరం. చెరువులను కాపాడేందుకే హైడ్రాను తీసుకొచ్చామని చెప్తున్న ప్రభుత్వం.. అదే బఫర్‌జోన్ పరిధిలో ఉన్న భూములను రెసిడెన్షియల్ ప్రాంతంగా మార్చే దిశగా అడుగు వేస్తుండటం ఆందోళనకరం.

**హైకోర్టు తీర్పుతోనైనా మేల్కొంటారా?**

హెచ్‌ఎండీఏ డెయిలీ సీరియల్ తరహాలో సాగుతున్న చెరువుల హద్దుల నిర్ధారణ ప్రక్రియపై ఇప్పటికే హైకోర్టు తీవ్రంగా స్పందించింది. హైదరాబాద్ నగరంలోని చెరువుల హద్దుల నిర్ధారణ, ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధిపై ఎప్పటికప్పుడు తమకు నివేదించాలని హెచ్‌ఎండీఏను ఆదేశించింది. హెచ్‌ఎండీఏ ఒకవైపు హైకోర్టుకు నివేదికలు అందజేస్తూనే, మరోవైపు చెరువు భూములను రెసిడెన్షియల్ ప్రాంతాలుగా మార్చివేస్తున్నది. నగర శివారుల్లో ఉన్న చెరువుల్లోనూ ఆక్రమణలు జరుగుతున్నాయి. ముఖ్యంగా ఎఫ్‌టీఎల్ భూముల్లోనూ రియల్‌ఎస్టేట్ వ్యాపారులు భారీ నిర్మాణాలు చేపడుతూనే ఉన్నారు. ఈ క్రమంలో ఆయా చెరువుల పరివాహక ప్రాంతాల్లో వెలసిన నిర్మాణ కార్యకలాపాలను నియంత్రించేలా చెరువుకు సుమారు 20-30 మీటర్ల దూరంలో ఉన్న భూములను బఫర్‌జోన్‌గా నిర్ధారించింది. మెజార్టీ చెరువుల్లో ఆక్రమణలు ఉన్నాయని, ఇటీవల హైడ్రా, ఎన్‌ఆర్‌ఎస్‌సీ నిర్వహించిన అధ్యయనంలో వెల్లడైంది. తాజాగా కుత్బుల్లాపూర్ మండలం బాచుపల్లి గ్రామ సర్వే నంబర్‌లోని 175, 171లో పది ఎకరాల భూమిలో కొంతభాగం అంబీర్ చెరువు విషయంలో... ట్యాంక్‌బెడ్, బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్ భూములను రెగ్యులరైజ్ చేసే అధికారం ప్రభుత్వానికి కూడా లేదని హైకోర్టు స్పష్టం చేసింది. కానీ అధికారులు మాత్రం చెరువులు, కుంటలను నిర్వీర్యం చేసేలా ఆ భూములను రెసిడెన్షియల్, మల్టీపర్పస్ భూములుగా మారుస్తుండటం ఆందోళన కలిగిస్తున్నది.



